క్లుప్తంగా

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం ప్రధాన రహదారిపై ఉన్న శ్రీత్యాగరాజ కళావేదికపై ఈనెల 16 నుంచి 20 వరకు సద్గురు శ్రీత్యాగరాజ స్వామి 178వ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 47 ఏళ్లుగా ఉత్సవాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తొలి రోజు ఉదయం ఆహ్వాన సభ, సాయంత్రం ప్రధాన కచేరీతో ఉత్సవాలు ప్రారంభవవుతాయని తెలియజేశారు. ప్రతి రోజు సాయంత్రం ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుల శాస్త్రీయ సంగీత కచేరీలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక కళాకారులు, ఔత్సాహిక సంగీత కళాకారుల కచేరీలు జరుగుతాయని తెలిపారు. 18న శ్రీ త్యాగరాజస్వామి అభిషేకార్చన, పంచరత్న కీర్తనల ఆలాపన , అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం



నగరంపాలెం: వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నాయుడుపేట డంపింగ్ యార్డులో నివాసితులకు అన్నదానం, ఆట వస్తువులు, దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్పర్సన్ పాశం శ్రీకృష్ణదేవరాయయాదవ్, సభ్యులు పాశం సర్దార్ అభినంద్‌యాదవ్, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు స్పందన



లక్ష్మీపురం: నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రగతి నగర్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు మ్యూజికల్ చైర్స్, బుట్టలో బాలు, లెమన్ అండ్ స్పూన్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, మహిళా సంఘం నగర అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ అందరితో కలిసి పోటీల్లో పాల్గొనడం వల్ల మానసిక ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. మహిళల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించడం కోసం ఆటల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పిల్లలను సెల్ ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ గుంటూరు కార్యదర్శి బి.ముత్యాలరావు, స్థానిక ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఫాతిమా, నాగలక్ష్మి, సుహాసిని, పవన్, గని, కిన్నెర పాల్గొన్నారు.

ఘనంగా కర్పూర జ్యోతి దర్శనం



చేబ్రోలు: సంక్రాంతి సందర్భంగా చేబ్రోలులోని చారిత్రిక ప్రసిద్ధి చెందిన నాగేశ్వర స్వామి దేవస్థానం వద్ద మంగళవారం రాత్రి కర్పూర జ్యోతి దర్శనాన్ని భక్తులు వీక్షించారు. సుమారు 50 కిలోల కర్పూరాన్ని అయ్యప్ప గురుస్వామి కర్పూర జ్యోతిని వెలిగించారు. దేవాలయంలోని అయ్యప్పస్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్త బృందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. కర్పూర జ్యోతి దర్శన కార్యక్రమానికి చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్పస్వాములు, భక్తులు తదితర భక్త బృందం చేపట్టిన జ్యోతి దర్శన కార్యక్రమం భక్తులకు కనువిందు చేశాయి. నాగేశ్వర స్వామి దేవస్థానంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం



గొడవర్రు(చేబ్రోలు): కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపంతో యువకుడు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గొడవర్రు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గొడవర్రు గ్రామానికి చెందిన ఇందేటి దుర్గారావు కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న దుర్గారావును 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి దొంగలు.. గప్‌చిప్ !

- పాత సామాను అమ్ముకున్న వారిపై చర్యలు శూన్యం
- విచారణ అధికారులను నియమించినప్పటికీ కొలిక్కి రాలేదు
- లక్షల రూపాయిల విలువైన సామాను అమ్ముకుని దర్జాగా తిరుగుతున్న సిబ్బంది
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: ఇంటి దొంగలపై చర్యలు తీసుకునేందుకు నగరపాలక సంస్థ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పలు రిజర్వాయర్లలో ఉంచిన పాత పైపులు, మోటార్లు, ఇతర ఐరన్ సామగ్రిని వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏఈల అండదండలతో అమ్ముకున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్షల రూపాయిలు విలువ చేసే పాత సామాన్లు మాయమై నెలలు గడుస్తున్నాయి. దీనిపై ప్రత్యేకంగా విచారణకు అధికారులను కేటాయించినప్పటికీ ఫలితం లేదు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై అధికారులు లాలూచీ పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో..

తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో కొద్ది నెలల కిందట రెండు లారీల్లో పాత మోటార్లు, పైపులను స్థానిక అధికారి అండదండలతో తరలించారు. దీని విలువ రూ. 30లక్షల నుంచి రూ. 40 లక్షల దాకా ఉంటుందని అంచనా.దీనిపై అప్పట్లో తీవ్ర దుమారంతో పాటు చర్చనీయాంశం అయింది. దీనిపై ప్రత్యేకంగా విచారణ అధికారిగా ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. విచారణలో సిబ్బంది సామాను అమ్ముకున్నట్లు ఒప్పుకున్నప్పటికీ దీనిపై అధికారులు ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో ఓ వ్యక్తి దీనిపై రాజీ కుదిర్చినట్లు సమాచారం.

ఏటీ అగ్రహారం పరిధిలో...

కొద్ది నెలల కిందట ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో రోడ్డు కింద ఉన్న పాత పైపు లైన్ల స్థానంలో కొత్తవి వేశారు. పాత పైపులైన్లను ఏటీ అగ్రహారంలోని ఇంజినీరింగ్ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు తెలుస్తోంది.

మిర్చి యార్డు పరిధిలో..

మిర్చి యార్డు వాటర్ ట్యాంకుల వద్ద సుమారు వందకు పైగా బీడు పైపులు ఉండాలి. అందులో ప్రస్తుతం 12 మాత్రమే ఉన్నాయి.దీనిపై సాక్షి పత్రికలో పలు కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. హౌసింగ్ బోర్డు వాటర్ ట్యాంకుల్లో ఐదు పాత మోటార్లకు గానూ ఒక్కటే ఉంది. కంకరగుంట ఆర్‌యూబీ బ్రిడ్జి వద్ద రెండు మోటార్లను అమ్మేసుకున్నారు. ఆర్‌యూబీలో వర్షం పడినప్పుడు నీరు తోడేందుకు ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్‌ను కూడా అమ్మేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై డెప్యూటీ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ తతంగంపై ఓ డీఈ కూడా విచారణ చేపట్టారు. మిర్చి యార్డు, హౌసింగ్ బోర్డు వాటర్ ట్యాంకుల్లో ఎవరైతే డ్యూటీలో ఉన్నారో వారు కచ్చితమైన సమాధానం చెప్పకపోతే అక్కడ విధులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో కథ బయటకు వచ్చింది. ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సామాన్లు అమ్ముకున్న మాట వాస్తవమేనని, అందులో తాను లేనని, బయట ఎవరికీ చెప్పవద్దు అంటూ రూ.5వేలు ఇచ్చారని డీఈ వద్ద ఒప్పుకున్నట్లు సమాచారం. ఇందులో ముగ్గురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా తెలిసింది.అయితే, ఇంత వరకు బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నగరపాలక సంస్థ పరిధిలో ఏ విచారణ మొదలెట్టినా దాన్ని పక్కన పెట్టడం పరిపాటిగా మారిందని సిబ్బంది చెప్పుకోవడం గమనార్హం.

ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసుల విచారణ

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో ఇటీవల వరుస చోరీలపై ఈనెల 14న సాక్షిలో ప్రచురించిన 'బస్టాండ్‌లో చోరీలు' కథనానికి స్పందన లభించింది. రోజుల వ్యవధిలోనే చోరీలు జరిగిన నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ప్రత్యేక విచారణ చేయిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అవుట్‌పోస్టులో అధికారులు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని, లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హెచ్చరికలు జారీ చేశారు. దీంతోపాటు విచారణ చేస్తున్న సమయంలో ఆర్టీసీ అవుట్‌పోస్టు అధికారులు, సిబ్బంది వ్యవహార శైలిపై అనేక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. స్థానికంగా ఉండే వ్యాపారుల విషయంలో సైతం పోలీసులు జోక్యం చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నా, ఏమైనా వివాదం జరిగినా వారికి మద్దతుగా ప్రయాణికులను అక్కడి నుంచి పంపించి వేస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిసింది.ఈ క్రమంలో మూడేళ్లకు పైగా ఓ అధికారి బస్టాండ్‌లో విధులు నిర్వర్తిస్తూ, ఆయన సొంత పనులు చక్కబెట్టుకున్నాడని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ క్రమంలో అధికారులు మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం రాత్రి శ్రీ భాస్కర డ్యాన్స్ అకాడమి (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. నాట్యాచారిణి డి.సాత్విక శిష్య బృందం లక్ష్మీ ప్రణతి, వైష్ణవి, శరణ్య, తనుశ్రీ, ఆరాధ్య, జాహ్నవి, మనస్విని, హాసిని, అక్షిత తదితరులు గణపతి తాళం , వారాహి, అల్లో నేరెల్లో, అష్టలక్ష్మి, గరుడ గమన, తిరు తిరు జవరాల, పాట్ డ్యాన్స్, మహా గణపతి, తెలుగు భాష విజయం, దశావతారం సంకీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.

మానసిక ఆందోళనతో విలేకరి శ్రీకర్ ఆత్మహత్య



లక్ష్మీపురం: మానసిక ఒత్తిడి, మనోవేదనతో కోలుకొండ శ్రీకర్ (55) అనే విలేకరి అపార్టుమెంట్ పైనుంచి దూకి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పటాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తురకపాలెం రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో శ్రీకర్ నివాసం ఉంటున్నాడు. భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కొంతకాలం ఓ ప్రముఖ పత్రికలో విలేకరిగా పని చేశాడు. బుధవారం పండుగ సందర్భంగా తండ్రి అస్థికలు కృష్ణానదిలో కలిపి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత బృందావన్ గార్డెన్స్‌లోని మై హోమ్స్ అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతరం అయ్యారు. పట్టాపురం పోలీసులు మృతుడు భార్య నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాల సందడి



గాలి పటాన్ని ఎగుర వేస్తున్న మున్సిపల్ కమిషనర్



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు



సంప్రదాయ వస్త్రధారణలో సంస్థ సభ్యులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం గంగిరెద్దుల, ఎద్దుల ప్రదర్శనలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, కరసాము, కోలాటం (మహిళలు, పురుషులు), స్టార్ మ్యూజికల్ నైట్, కాంతారా యాక్ట్, జగలర్స్ షో , బటర్ ఫ్లై, రోబో యాక్ట్ ప్రదర్శనలతో సందడి నెలకొంది. సంబరాల్లో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొన్నారు. సంబరాల్లో చివరి రోజైన బుధవారం కనుమ పండుగరోజు గాలిపటాలు ఎగరేయడం, ప్రాసమణి ప్రోగ్రామ్, మ్యాజిక్ షో(ఇల్ యూజన్ షో), క్లాసికల్, ఫోక్ డ్యాన్స్ (ఖలీల్), వాసవీ ఆర్కెస్ట్రా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజలు ఉత్సాహంతో తిలకించారు. ఈ సందర్భంగా సంబరాలకు హాజరైన నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ నగరాల్లో నివసించే ప్రతి ఒక్కరి మూలాలు గ్రామాలతో ముడిపడి ఉంటాయని తెలిపారు. రైతులు సంతోషంగా ఉంటేనే సమాజం సంతోషంగా ఉంటుందని తెలిపారు. సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుంటూరు నగరంలో సంక్రాంతి సంబరాల ద్వారా నగరం సంక్రాంతి శోభ సంతరించుకుందని చెప్పారు. వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ నగర ప్రజలందరినీ అలరించేలా కూటమి ప్రభుత్వ హయాంలో సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంక్రాంతి అంటేనే ప్రతి ఇంట ఆనంద క్రాంతి వెల్లివిరుస్తుందన్నారు. ఇటువంటి సంబరాలు ప్రతి ఏడాది జరగాలని కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు అందరినీ అలరించాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, జీఎంహెచ్ డాక్టర్ అమృత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

లక్ష్మీపురం: తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జీవన సంధ్య కార్యదర్శి సిరపల్లి కృష్ణారావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం సంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే ఆనందానికి, సందడికి నిలయమని తెలిపారు. కుటుంబం యావత్తు ఒక చోటకు చేరి ఆనందోత్సవాలతో ఈ మూడు రోజులూ గడుపుతారన్నారు. ఈ పండుగ కోసం సంవత్సరం మొత్తం ఎదురు చూస్తుంటారని తెలిపారు. అన్ని పండుగలను ఉత్సాహంగా అవగాహన సంస్థ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభ్యుల్లో ప్రతి ఒక్కరూ పాట, పద్యం, కవిత, జోక్ అయినా చేప్పేలా, ఆలపించేలా చేయాలనేది తమ సంస్థ ఉద్దేశమని తెలిపారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణలో గెలుపొందిన సంస్థ సభ్యుడు ఆర్.వి.సింగరయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పుట్టలమ్మ తల్లి గ్రామోత్సవం



భక్తుడు దుగ్గెంపూడి సుధాకర్‌రెడ్డి రూ.15 లక్షలకు దక్కించుకున్నారు.

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల ఇలవేల్పు దేవత ఘంటాలమ్మతల్లి, పుట్టలమ్మతల్లి అమ్మవారి సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో మంగళవారం అమ్మవారి లడ్డూ ప్రసాదం వేలంలో గత ఏడాది పాడుకున్న వెంగళాయపాలెం గ్రామానికి చెందిన భక్తుడు నరశింహారావు ఇంటినుంచి అమ్మవారి నగలు భారీ ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. అనంతరం బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కోలాటాలు, కూచిపూడి నృత్యాలు, భరతనాట్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలందుకున్న లడ్డు వేలంపాట నిర్వహించారు. అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకునేందుకు భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన వేలంలో నల్లపాడు గ్రామానికి చెందిన భక్తుడు దుగ్గెంపూడి సుధాకర్‌రెడ్డి రూ.15 లక్షలకు దక్కించుకున్నారు.

వైభవంగా మకరజ్యోతి దర్శనం



మకర జ్యోతి ప్రజ్వలన చేస్తున్న క్రేన్ గ్రూప్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు



హాజరైన భక్తులు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో మకర జ్యోతిని దర్శించుకుంటున్న భక్తులు



కోదండరామ మందిరం వద్ద మకర జ్యోతి దర్శనం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ అయ్యప్పస్వామి దేవస్థానంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా మకర జ్యోతి దర్శన మహోత్సవం నిర్వహించారు. క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, హైమావతి దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం స్వామి వారి తిరువాభరణాలను సంపత్ నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరీ నుంచి దేవాలయం వరకు కాంతారావు దంపతులు, కాంతారావు పెద్ద అల్లుడు మానేపల్లి దివాకర్, పెద్ద కుమార్తె హిమజ, కుటుంబ సభ్యులు, భక్తులు తీసుకువచ్చారు. అనంతరం స్వామి వారికి అలకరించారు. వేలాది భక్తుల శరణ ఘోష నడుమ కాంతారావు దంపతులు మకర జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 49 ఏళ్లుగా దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జరిగిన భక్తిగీతాల సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రూప్ సంస్థల సిబ్బంది, టంగుటూరి మణి, ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కోదండరామ మందిరం వద్ద..

నగరంపాలెం: స్థానిక ఏలూరు బజార్ కోదండరామ మందిరం వద్ద శ్రీవాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం అత్యంత వైభవంగా మకర జ్యోతి నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు భారీ హాజరై మకర జ్యోతిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు తడికమళ్ల మణికంఠ, నాళం శివప్రసాద్, పాదర్తి ఉమ, ఎల్ఐసీ రవి పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో...

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో మకర జ్యోతి దర్శనాన్ని మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మకర జ్యోతి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా విశ్వంజీ మహారాజ్, బ్రహ్మజ్ఞానానంద సరస్వతి స్వామి (కెనడా) మకర జ్యోతి వెలిగించారు. భక్తులకు అనేక అంశాలను వివరిస్తూ అనుగ్రహభాషణ చేశారు. తొలుత మకర సంక్రాతి సందర్భంగా నిర్వహించిన గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. అనంతరం అన్నమయ్య కళావేదికపై విశేష అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లంక విజయబాబు, పుట్ట ప్రభాకరరావు, సూర్యదేవర వెంకటేశ్వర్లు, గోపీచంద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి 133వ ఉరుసు ఉత్సవాలు

నగరంపాలెంలో ఐదు రోజుల నిర్వహణ



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: హజరత్ కాలే మస్తాన్ షా అవులియా బాబా 133వ ఉరుసు ఉత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభమవుతాయని జగద్గురువులు హజరత్ కాలే మస్తాన్ షావలి, దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు తెలిపారు. ఉత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గుంటూరు నగరంపాలెంలో ఈనెల 17వ తేదీ నుంచి 21వరకు అత్యంత వైభవంగా జరిగే ఉరుసు ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఆరాధించే దైవం మస్తాన్ బాబా అని చెప్పారు. 133వ ఉరుసు ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, 17న చాందిని అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అదే రోజు అన్నదానం, రాత్రి 11 గంటలకు సందల్ (గంధం) ఊరేగింపు వేలాది మంది భక్తులతో కొనసాగుతుందని తెలిపారు. 18న సాయంత్రం ఆరు గంటలకు గంధం పంపిణీ, దీపారాధన, అనంతరం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. 19న రాత్రి 10 గంటలకు గ్యార్మి షరీఫ్ (ఖురాన్ పఠనం), తెల్లవారుజామున ప్రసాదం పంపిణీ, అన్నదానం జరుగుతాయని చెప్పారు. 20న భక్తులు ఏడాది పొడుగునా బాబా వారికి భక్తిశ్రద్ధలతో సమర్పించుకున్న చద్దర్లు (శేష వస్త్రాలు) ఫకీర్లకు అందిస్తామని తెలిపారు. 21న బాబా వారు ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచడంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాలు మేళతాళాలు, కనక తప్పెట్లు, బుట్ట బొమ్మలు, కోలాటాలతో కన్నుల పండువగా జరుగుతాయని పేర్కొన్నారు. వైద్యులు అందుబాటులో ఉంటారని, ఉచిత ప్రథమ చికిత్సలు, మందుల పంపిణీ, నిత్యం అన్న సంతర్పణ ఉంటాయని తెలిపారు. నిత్యాన్నదానంలో భాగస్వాములయ్యే భక్తులు విరాళాలను హెచ్‌డీఎఫ్ బ్యాంకు ఖాతా నంబర్ 99933786999999కు, ఐఎఫ్ఎస్సీ కోడ్‌ హెచ్‌డీఎఫ్– 0002825 ద్వారా జమ చేయవచ్చని ఆయన తెలియజేశారు.

త్రిపురనేని రామస్వామికి ఘన నివాళి



త్రిపురనేని రామస్వామి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న నాయకులు



పోస్టర్ ఆవిష్కరణలో కవిరాజు సాహితీ సమితి సభ్యులు

లక్ష్మీపురం: స్వాతంత్ర్యానికి పూర్వమే కర్మ సిద్ధాంతానికి వ్యతిరేకంగా, కులమతాలకు అతీతంగా మనుషులను గౌరవించాలి అంటూ కవిత్వాల్ని రాయడమే కాకుండా సాంఘిక, ఆర్థిక అసమానతులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని కేవీపీఎస్ నాయకులు గోనే లూథర్ అన్నారు. స్థానిక 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని సీహెచ్. హరిబాబు స్మారక భవన్‌లో సీఐటీయూ నాయకులు మస్తాన్‌వలి అధ్యక్షతన బుధవారం సాయంత్రం కవిరాజు త్రిపునేని రామస్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు పద్మ, అచ్యుత కుమారి, మురళి, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

'కవిరాజు విజయం' టెలీ ఫిలిం పోస్టర్ ఆవిష్కరణ

నగరంపాలెం: స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని శ్రీ రాయపాటి వెంకటరంగారావు కళాశాలలో బుధవారం త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి వేడుకలు నిర్వహించారు. కవిరాజు సాహితీ సమితి గౌరవాధ్యక్షుడు గద్దె మంగయ్య, అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బయ్య, ఉపాధ్యక్షులు రావెల సాంబశివరావు, రావెల బసవపున్నమ్మలు రామస్వామి చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కవిరాజు విజయం పద్య రూపక టెలీ ఫిలిం పోస్టర్ విడుదల చేశారు. కవిరాజు సమాజానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు చిట్టినేని లక్ష్మీనారాయణ, కార్యదర్శి వల్లూరి తాండవకృష్ణ, పాటిబండ్ల విష్ణువర్ధన్, చెరుకూరి సత్యనారాయణ, పారా అశోక్‌కుమార్, బైరపనేని నరేష్, డాక్టర్ పాపినేని శివశంకర్, పి.వి.రమణ, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ మోటూరి రవికుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జోరుగా సాగుతున్నాయి. మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నాల్గవరోజు బుధవారం పశ్చిమ గోదావరి - కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో పశ్చిమ గోదావరిజట్టు గెలిచింది.